మానవ హక్కుల ప్రస్థానం

జీవించే హక్కుల రక్షణ కోసం జీవించిన మానవ హక్కుల ఉద్యమ నేత మన బాలగోపాల్ ఆకస్మిక మరణంతో మానవ హక్కుల ఉద్యమం ఒక పెద్ద దిక్కును కోల్పోయింది. మరణించిన వాళ్ళు ఎలాంటి వాళ్ళయినా మరణ విషాద సమయంలో వాళ్ళ మంచి చెడ్డల్ని ఎంచి చూడడం సందర్భోచితం కాదనేది ఓ లోకోక్తి. మరో మాటల్లో చెప్పాలంటే మరణించిన వాళ్ళ గురించి మంచి తప్ప చెడ్డ మాట్లాడకూడదనే ఆ లోకోక్తి సారాంశం. పౌర, ప్రజాస్వామిక, మానవీయ హక్కుల ఉద్యమ జెండానే తన జీవిత అజెండాగా ఎంచుకుని నీతి నిజాయితీలకు నిలువుటద్దంగా నిలచిన అరుదైన, అద్భుతమైన బాలగోపాల్ వ్యక్తిత్వం ఈ లోకోక్తికి అతీతం అంటే అతిశయోక్తి కాదు. అతనొక లెక్కల మాస్టరే కాదు, శత్రువులు సైతం లెక్కలోకి తీసుకోక తప్పని హక్కుల మాస్టర్. నిర్మొహమాట, నిర్భయ, నిష్పక్షపాత, పీడిత ప్రజల పక్షపాతి. బాలగోపాల్ వ్యక్తి కాదు, పీడిత ప్రజల గుండె చప్పుడుగా మారిన శక్తి, అది గ్రహించలేని పోలీసు మూకలు ఆయనను కిడ్నాప్ చేసి నిప్పుతో చలగాటమాడితే ఆంధ్ర 'దేశ' వ్యాపితంగా వెల్లువెత్తిన పౌర ప్రజాస్వామ్య ప్రతిస్పందనకు తాళలేక సురక్షితంగా విడిచిపెట్టి చేతులు కాల్చుకొన్న ఉదంతమే అందుకు నిదర్శనం.

బాలగోపాల్ కేవలం మానవ హక్కుల నేతగానే కాక ప్రముఖ మార్క్సిస్టు మేధావిగా, ఆధునిక అనంతర నిరంతర సాహిత్య విమర్శకుడిగా, సమకాలీన సామాజిక ఆర్థిక రాజకీయ పరిణామాలపై నిరంతరం వ్యాసాలు రాసే పత్రికా రచయితగా, బహుముఖ ప్రజ్ఞాశాలిగా తన ప్రతిభా పాటవాలను పీడిత ప్రజల కోసం అంకితం చేసిన ప్రజా

మేధావి. మార్క్సిస్టులకు కొరుకుడు పడని ఆయన 'మానవ ప్రవృత్తి' సిద్ధాతం, నక్సలైట్ నేతలకు మింగుడు పడని ఆయన 'చీకటి కోణాలు', రాజ్యహింసతో పాటు విచక్షణా రహిత నక్సల్స్ ప్రతి హింస కూడా జీవించే హక్కుల్ని హరిస్తున్నాయని తప్పుపట్టడం లాంటి వివాదాస్పద అంశాలు విప్లవ శక్తులనుండి ఆయనను సంస్థాగతంగా కొంత దూరం చేసినా అందరి ఆదరాభిమానాల్ని చూరగొన్న అరుదైన వ్యక్తిత్వం బాలగోపాల్‌ది.

ఇదంతా ఒక ఎత్తయితే పౌరహక్కుల పరిధిని మానవ హక్కుల దాకా, ప్రజాస్వామిక హక్కుల హద్దుల్ని సామాజిక ప్రజాస్వామ్య హక్కుల సరిహద్దుల దాకా విస్తరించడంలో బాలగోపాల్ నిర్వహించిన అద్వితీయమైన చారిత్రాత్మక పాత్ర ఒక్కటే ఒక ఎత్తు. మరో ప్రముఖ మానవ హక్కుల ఉద్యమనేత, బాలగోపాల్ సన్నిహిత సహచరుడు బుర్రా రాములు వ్యాఖ్యానించినట్టు బాలగోపాల్ చరిత్ర పాత్ర వందేళ్ళ పౌరహక్కుల ఉద్యమాన్ని తిరగరాసిన చరిత్ర. వందేళ్ళనాడు జాతీయోద్యమ కాలంలో మహాత్మా పూలే, అంబేద్కర్లు నిర్మించిన దేశీయ మానవ హక్కుల ఉద్యమ వారసత్వాన్ని ఎలాంటి హిపోక్రసీకి తావు లేకుండా చిత్తశుద్ధితో స్వీకరించడం, ఆచరణలో మానవ హక్కుల ఉద్యమాన్ని నిర్మించడమే అందుకు నిదర్శనం అన్నారు. 1981లో వరంగల్‌లో ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల ఉద్యమంలో అడుగుపెట్టినప్పటి నుండి ఆయనతో నాకు వ్యక్తి గతపరిచయం ఉంది. అదే వరంగల్ జిల్లాలో విప్లవోద్యమ కార్యకర్తగా నేను పనిచేస్తున్నప్పుడు రెండు విప్లవ సంస్థల మధ్య ఘర్షణ వాతావరణం ఏర్పడగా దాన్ని నివారించటానికి నియమించిన నిజనిర్ధారణ కమిటీలో ఆయన భాగస్వామిగా ఉండి నిర్వహించిన నిష్పక్షపాతపాత్ర ఆయనతో నా సాన్నిహిత్యానికి నాంది పలికింది. 1989లో నేను సంపాదకుడిగా 'ఎదురీత' మాస పత్రికను ప్రారంభించి, దళిత బహుజన సామాజిక ప్రజాస్వామ్య మానవ హక్కుల ఉద్యమ నిర్మాణంలో క్రియాశీలక పాత్ర వహిస్తున్నప్పుడు జరిగిన సిద్ధాంత చర్చకు ఆయన బాసటగా నిలిచారు.

1983 నుండి 1998 వరకు ఆంధ్రప్రదేశ్‌లో పౌరహక్కుల సంఘానికి ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన బాలగోపాల్ పౌరహక్కుల ఉద్యమాన్ని మానవ హక్కుల ఉద్యమంగా విస్తరించాల్సిన ఆవశ్యకతను గుర్తించి మార్పు తీసుకొస్తున్నారు. అందుకు అనుగుణంగా 1999లో మానవ హక్కులవేదిక స్థాపించి దాని వ్యవస్థాపక అధ్యక్షుడిగా

అనేక మందికి స్ఫూర్తినిచ్చి, మానవ హక్కుల ఉద్యమ నేతగా ఆవిర్భవించి, దళిత బహుజన శక్తుల గుండె చప్పుడుగా వారి ఆదరాభిమానాల్ని చూరగొన్నారు. మానవ హక్కులకు, రాజ్యాంగబద్ధమైన చట్టపరమైన పౌరహక్కులకు, సార్వజనీనమైన పౌరప్రజాస్వామ్య హక్కులకు మధ్య తేడా ఏమిటి? మానవ హక్కుల్ని నిరాకరించే కుల వివక్షకు పరాకాష్ఠ అయిన అస్పృశ్య దళితుల హక్కుల్ని మానవ హక్కులుగా పరిగణించాల్సిన ఆవశ్యకత ఏమిటి? ఆ ప్రశ్నల మీద ఆనాడు జరిగిన సిద్ధాంత చర్చ బాలగోపాల్ వైఖరిలో తెచ్చిన మార్పు ఏమిటి? అనే అంశాల్ని ఈ సందర్భంగా ప్రస్తావించడం అసందర్భం కాదు. ఊరుకు సంబంధించిన పౌర సదుపాయాలను అనుభవించడానికి ఊరి బయటి దళితులకు హక్కు లేకుండా చేస్తున్న అస్పృశ్యత వారికి మానవ హక్కుల్ని నిరాకరిస్తోంది.

దళితుల్ని తమ తోటి మనుషులుగా చూడకుండా ఊర్లోని గుడికి, బడికి, మడి (భూమి)కి దూరం చేస్తోంది. వారికి సమాన హక్కుల్ని నిషేధిస్తోంది. జంతువులకంటే హీనంగా పరిగణించి వారి పట్ల అంటరాని తనాన్ని పాటిస్తోంది. సాధారణ పౌరులకు లభించే పౌరహక్కులు సంగతి అటుంచి కనీస మానవ హక్కుల్నే అనుభవించలేని స్థితిలో ఉన్న దళితుల సమస్య ప్రాథమికంగా మానవ హక్కుల సమస్య అవుతుంది. ఈ మానవీయ సమానవీయ మానవ హక్కుల సమస్యను దళిత ఉద్యమం ముందుకు తేవడంతో బాలగోపాల్ వంటి పౌరహక్కుల ఉద్యమ నేతలు పునరాలోచనలో పడ్డారు. దళితులతో పాటు ఇతర వెనుకబడిన కులాల, తరగతుల బీసీల సామాజిక న్యాయ హక్కుల్ని, రిజర్వేషన్ హక్కుల్ని కాలరాస్తున్న మండల్ వ్యతిరేక అగ్రకుల శక్తుల నిరంకుశత్వంపై సామాజిక న్యాయపోరాటం వెల్లువెత్తినప్పుడు బీసీల సామాజిక ప్రజాస్వామ్య హక్కుల అంశం అజెండా మీదకు వచ్చింది. హిందూ మతోన్మాదం, ముస్లిం మైనారిటీల మత స్వేచ్ఛాహక్కుల్ని హరించినపుడు మైనారిటీ సెక్యులర్ ప్రజాస్వామ్యహక్కుల అంశం ముందుకొచ్చింది. మహిళల్ని వరకట్న హత్యలతో అత్యాచారాలతో గృహహింసకు, జండర్ హింసకు గురిచేసే మగ పెత్తందారీతనానికి వ్యతిరేకంగా స్త్రీవాద ఉద్యమ శక్తులు గళమెత్తడంతో మహిళా సామాజిక హక్కులు సామాజిక ప్రజాస్వామ్య హక్కులుగా గుర్తింపులోకి వచ్చాయి.

ఈ విధంగా పీడిత వర్గ ప్రజల సాధారణ పౌరహక్కులతో పాటు ఈ మానవ

హక్కుల సామాజిక ప్రజాస్వామిక హక్కులను కూడా గుర్తిస్తూ, ప్రణాళికా బద్ధం చేస్తూ బాలగోపాల్ మానవ హక్కుల వేదిక స్థాపించటం పౌర హక్కుల ఉద్యమ చరిత్రను మరో మలుపు తిప్పటం జరిగింది. ఎమర్జెన్సీ వంటి ఫాసిస్టు చర్యలు ప్రకోపించినపుడు రాజ్యాంగ పరిధి దాటి, చట్ట పరిధి దాటి సార్వజనీన ప్రజాస్వామ్య హక్కుల కోసం దేశ వ్యాప్తంగా ప్రజాస్వామ్య ఉద్యమం వెల్లువెత్తింది. వీటన్నింటి స్ఫూర్తిని స్వీకరించిన బాలగోపాల్ ఒక్క మాటలో వందేళ్ళ పౌర, ప్రజాస్వామ్య, మానవ హక్కుల ఉద్యమాన్ని విశాల దృక్పథంతో విహంగ వీక్షణం చేయబట్టే సమగ్ర హక్కుల ఉద్యమ నిర్మాతగా చరిత్రలో చిరస్మరణీయమైన స్థానాన్ని పొందగలిగారు.

- ఉ.సా

రచయిత సత్యశోధక సామాజిక అధ్యయన కేంద్రం కన్వీనరు

సూర్య దినపత్రిక, అక్టోబరు 10, 2009